క్లుప్తంగా

ఘనంగా శ్రీవారి చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరాహలక్ష్మి నృసింహస్వామి క్షేత్రం చందనయాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు శ్రీవారి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అవసరాల కిరణ్ స్వామి, వారి శిష్య బృందం, వేద పండితుల సమక్షంలో వేద మంత్రోచ్చరణ మధ్య ఆలయం ఆవరణలోని కోనేరులో శ్రీవారి చక్రస్నానం ఘట్టం కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత ఉదయం, 8 గంటలకు ఆరాధన, హోమాలు, నిత్యరూప దర్శనం (చందన రూప సేవ)నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులకు శ్రీవారి అన్న ప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



జేగురుపాడులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్

కడియం: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని జేగురుపాడు సర్పంచ్, కడియం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. ప్రతి శనివారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత నినాదంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులతో కలిసి వంతెన వద్ద, కల్యాణ మండపం సెంటర్ తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించి, డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రత్నం అయ్యప్ప



అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రత్నం అయ్యప్ప

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రత్నం అయ్యప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా అసోసియేషన్ ఎన్నికను ఏకగ్రీవం చేసి, ముందుగా మల్లు పోలరాజుకు బాధ్యతలు అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఆయన పదవీకాలం పూర్తి కావడంతో రత్నం అయ్యప్పకు బాధ్యతలు అప్పగించారు. నర్సరీ రంగ ప్రముఖుల సమక్షంలో అయ్యప్ప కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయంలో తన పాలకవర్గంతో కలిసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల సేవలు భేష్



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల అందిస్తున్న సేవలు బాగున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిలతో మాట్లాడి రాజమహేంద్రవరం కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్విని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

రాజానగరం: చక్రద్వారబంధం దేవీచౌక్ వద్ద కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ జరిగిన 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చండీ హోమం నిర్వహించి, పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అదే సమయంలో అక్కడే కొలువైన మృత్యుంజయస్వామికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కమనీయం జనార్దనస్వామి కల్యాణం



ధవళేశ్వరం వీధుల్లో సాగుతున్న జనార్దనస్వామి రథోత్సవం



పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న మంత్రి కందుల దుర్గేష్



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

- తరలివచ్చిన అశేష భక్త జనం
- వైభవంగా సాగిన జనార్దనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం: ధవళగిరిపై కొలువైయున్న లక్ష్మీజనార్దన స్వామివారి రథోత్సవం, కల్యాణోత్సవం వైభవంగా కొనసాగింది. ధవళేశ్వరంలోని ధవళగిరి గోవింద నామస్మరణతో పులకించింది. చూసిన కనులదే వైభోగం అన్నట్లు సాగింది. నవజనార్దనుల్లో ప్రథముడైన ధవళగిరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామి రథోత్సవం, కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున విశేష అర్చనలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కొబ్బరికాయ కొట్టి స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం రథ సంప్రోక్షణ, మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామి వారి రథోత్సవం, అంకురార్పణ, వాస్తు పూజ, అనంతరం స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి కొండ దిగువ నుంచి ప్రారంభమైన రథోత్సవం అంకాలమ్మ గుడి మీదుగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు సాగింది. పోలీస్‌స్టేషన్ వద్ద సంప్రదాయం ప్రకారం డీఎస్పీ భవ్య కిషోర్, సీఐలు టి గణేష్, కె మంగాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, యువకులు అధిక సంఖ్యలో స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలకు తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కె నాగసురేష్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు సుదర్శనం వెంకట సత్యనారాయణ ఆచార్యులు (కాసులు), పవన్‌కుమార్ నిర్వహించారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడి ఊరేగింపు



దుళ్లలో వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యుల పర్యవేక్షణలో, వేద పండితులు భక్తుల సహకారంతో కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జామున ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూలమండపంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేసారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సహస్ర దీపాలంకరణ అనంతరం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవాయిద్యాల నడుమ విశేష భక్తజనం వెంటరాగా స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటేశ్వరరావు సతీసమేతంగా దర్శించుకున్నారు.

బాల్యం నుంచీ మానవతా విలువలు నేర్పించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సత్యసాయి విద్యా విభాగ రాష్ట్ర సమన్వయకర్త మధుసూదనరావు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాల్యదశ నుంచీ చిన్నారులకు మానవతా విలువలు నేర్పించి ఆదర్శ పౌరులుగా తయారు చేసే శ్రీ సత్యసాయిబాలవికాస్ తరగతులకు తమ చిన్నారులను పంపాలని శ్రీ సత్యసాయి విద్యా విభాగ రాష్ట్ర సమన్వయకర్త టి. మధుసూదనరావు పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం శ్రీ సత్య సాయి సమాజ సేవా కేంద్రంలో శనివారం జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లాస్థాయిలో నిర్వహించిన శ్రీ సత్యసాయి బాలవికాస్ గురువుల ఒక్కరోజు శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు సంస్కారాన్ని, భారతీయ సంస్కృతిని చిన్నారులకు నేర్పించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. దీనికి మూడేళ్ల చొప్పున 9 ఏళ్ల పాటు నిర్వహించే మూడు గ్రూపుల బాల వికాస్ తరగతులకు విధిగా పంపాలని ఆయన కోరారు. శ్రీ సత్య సాయి సేవా సంస్థల కార్యక్రమాల్లో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆదర్శ బాల వికాస్ గురువు, స్వామి అనుగ్రహం, పేరెంటింగు వంటి అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. గ్రూపు యాక్టివిటీస్ ద్వారా తక్కువ ఖర్చుతో ఆకర్షణీయమైన వస్తువులు తయారు చేయడంలో బాలవికాస్ గురువులు తీసుకోవాల్సిన మెలకువలను రాష్ట్ర విద్యావిభాగా మహిళా సమన్వయకర్త ఆర్.మాధవి ప్రయోగాత్మకంగా వివరించారు. విభిన్న పద్ధతుల్లో కథలు చెప్పే విధానాన్ని పప్పెట్ ప్రదర్శన ద్వారా సి.కిరణ్‌కుమార్ వివరించారు. హుకుంపేట రామకృష్ణనగర్ బాలవికాస్ విద్యార్థుల వేద పఠనం, కోలాటం నృత్యం, మూకాభినయం అలరించింది. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యల శ్యామ్ సుందర్, మందిర కార్యదర్శి ఘంటా హనుమంతరావు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్తలు ఎన్వి.సాయిరాం, జి. సత్యవతి, సేవాదళ్ సమన్వయకర్తలు రోహిణి కుమార్, రామలక్ష్మి, విద్యా విభాగ సమన్వయకర్తలు ఎల్.శ్రీనివాసరాజు, ఎం.సాయి నీహారిక, జోనల్ కన్వీనర్లు త్రిమూర్తులు, విజయ సాయి, సబ్జోన్ కన్వీనర్లు, సేవా సమితి, భజన మండలి కన్వీనర్లు, బాల వికాస్ గురువులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ముసుగులో చోరీలు

- ప్రయాణికుల్ని మోసగిస్తూ బంగారం చోరీ
- సీసీ కెమెరాల ద్వారా పట్టుకున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆటో ఎక్కిన ప్రయాణికులకు మాయ మాటలు చెప్పి వారి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ఆటో డ్రైవర్‌ను రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాజీలాల్ శనివారం స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఈనెల 1న ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యలో ఆటో డ్రైవరు ఆమెకు జాగ్రత్తలు చెప్తూ, నగరంలో చోరీలు జరుగుతున్నాయి, ఒంటి మీద బంగారం ఏదీ ఉండకూడదు అని మాయ మాటలు చెప్పాడు. ఆమె చెవి దిద్దులను తీయించి ఒక పేపర్‌లో చుట్టమని చెప్పాడు. ఆమె తన బ్యాగ్‌లో పెట్టుకొనే సమయంలో చెవి దిద్దులను దొంగిలించాడు. ఇంటికి వెళ్లి బ్యాగ్ చూసుకున్న బాధితురాలు తన బంగారు వస్తువులు ఆటో డ్రైవరే దొంగలించి ఉంటాడని గుర్తించి కుటుంబ సభ్యుల సహాయంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు పర్యవేక్షణలో ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.శివప్రసాద్ దర్యాప్తు చేశారు. పోలీసు బృందాలుగా ఏర్పడి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాధితురాలు ఇంటి వరకు మార్గమధ్యలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజి పరిశీలించారు. నేరం జరిగిన ఆటోను గుర్తించి నామవరం డి బ్లాక్‌కు చెందిన ఆటో డ్రైవర్ చొల్లంగి విజయ్‌కుమార్‌ను అదుపులో తీసుకున్నారు. అతడిని విచారించగా చేసిన నేరం అంగీకరించాడు. అతని నుంచి 4 గ్రాముల బంగారపు చెవి దిద్దులు స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు. అతడిపై 2019లో బొమ్మూరు స్టేషన్ లో ఇదే తరహా కేసు నమోదైనట్టు సీఐ బాజీలాల్ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన, ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే. బాజీలాల్, ఎస్సై శివప్రసాద్, హెచ్‌సీ ఎన్.రాంబాబు, పీసీలు కే.ప్రదీప్ కుమార్, ఎస్ వీరబాబును జిల్లా ఎస్పీ అభినందించారు.

సిస్టమ్స్ అసోసియేట్స్‌గా ఆదిత్య విద్యార్థుల ఎంపిక



సిస్టమ్స్ అసోసియేట్స్‌గా ఎంపికైన ఆదిత్య విద్యార్థులతో అధ్యాపకులు

కంబాలచెరువు: ఇన్ఫోసిస్, ఐటీ రంగాల్లో సిస్టమ్స్ అసోసియేట్స్‌గా సీటీసీ–2.22 ఎల్‌పీఏగా 39 మంది స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని ఎస్పీ గంగిరెడ్డి తెలిపారు. బీసీహెచ్ చెందిన 14 మంది ఎంపికయ్యారని ఆయన తెలిపారు. డేటా సైన్స్‌కు చెందిన ఐదుగురు, ఎయిర్‌కి చెందిన మరికొందరు విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో 15 మందితోపాటు 39 మంది విద్యార్థినీవిద్యార్థులు ఎంపిక కావడం తమకు చాలా ఆనందకరమని ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కేఏన్ రెహమాన్ శనివారం అన్నారు. సంస్థ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సుగుణారెడ్డి విద్యార్థులను అభినందించారు. ముఖ్యంగా సీఆర్టీ టీం అధినేత శ్రీనివాసరెడ్డి, సీఆర్టీటీంలకు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దుర్గారావు, మహిళా కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి అండ

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా



జంభూపట్నంలో పట్టాభిరామన్నను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే అండని, వారికి ఎల్లప్పుడు చేదోడుగా ఉండటంలో జక్కంపూడి కుటుంబం ముందుంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని, పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఆయా కుటుంబాలకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పార్టీకి ప్రజాదరణ అధికమవుతోందన్నారు. ఆ ఉత్సాహంతో మరింత దూసుకువెళ్తామన్నారు. తొలుత జంభూపట్నంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉల్లి పట్టాభిరామన్న, గుర్రాల నాగేశ్వరరావును పరామర్శించారు. స్థానిక గుమ్ములూరులో ఇటీవల ఈర్ల అంజి, జెట్టి ఉమామహేశ్వరరావు మృతి చెందారు. ఆయా కుటుంబాలకు చెందిన వారిని రాజా పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఉన్నారు.

కోటి దత్తసాయి ధ్యాన మందిరానికి శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామంలో శనివారం దత్తసాయి ధ్యాన మందిరానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నాయకులు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ దత్తసాయి ధ్యాన మందిరం నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామన్నారు. పురాతన దేవాలయాలు, ధ్యాన మందిరాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గోవిందనామంతో మార్మోగిన గొల్లల మామిడాడ



గొల్లల మామిడాడలో చిన్నారుల కోలాట ప్రదర్శన



సూర్యభగవానుని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెదపూడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని గోవింద నామ స్మరణతో గొల్లల మామిడాడ మార్మోగింది. ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్య భగవానుని కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి కల్యాణం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జిల్లా నలు మూలల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున భక్తులకు తీర్థ ప్రసాదాలు, పాలు, అల్పాహారం అందించారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 1.05 గంటలకు రథోత్సవాన్ని వ్యవస్థాపక వంశ పారంపర్య ధర్మకర్త కొవ్వూరి బాలకృష్ణారెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని వెలంపేటలో కొలువైన అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ ఘట్టానికి లగుడు బాపిరాజు, దుర్గాభవాని దంపతులు కర్తలుగా వ్యవహరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అంగరంగ వైభవంగా జరిగిన కల్యాణాన్ని భారీ సంఖ్యలో మహిళలు తిలకరించారు. బ్యాంక్ వీధిలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం రెండు చోట్లా అన్న సమారాధనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హరినామ స్మరణ

రాజానగరం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరస్వామి, రామాలయం, కృష్ణాలయాలలో ఉదయం నుంచి భక్తులు స్వామివార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అగ్రహారం, ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, మల్లంపూడి, వెలుగుబంద, చక్రద్వారబంధం, రాదేయపాలెం, తుంగపాడు, సంపత్‌నగరం, శ్రీరామపురం, పాలచర్లలోని రామాయాలు, రాజానగరం, దివాన్‌చెరువులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు భజనలు చేశారు. దీనితో ఆయా ప్రాంతాలు హరినామస్మరణతో మార్మోగాయి.

ప్రత్యేక పూజలు

మధురపూడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారం రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. కోరుకొండ మండలం బూరుగుపూడి బాబామందిరంలో 108 సార్లు విష్ణు సహ సహస్రపారాయణ చేశారు. సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత



పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులను సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి

రాజానగరం: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలనా తీరుపై ప్రజలు విసిగిపోతున్నారని, ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో చంద్రబాబుపై ప్రజావ్యతిరేకత పెరుగుతోందని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఇదే సమయంలో ప్రజలను కలుసుకుని, ముచ్చటిస్తూ జగన్న ప్రభుత్వంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తు చేయడం ద్వారా జనాభిమాన్ని చూరగొనవచ్చని క్యాడర్‌కి ఆయన సూచించారు. పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి పడాల వీరరాఘవరెడ్డి (ఆర్టీఐ), అనపర్తి నియోజకవర్గ నుంచి దుర్గారెడ్డి (యువజన విభాగం) తమ అనుయాయులతో డాక్టర్ శ్రీనివాస్‌ని దివాన్‌చెరువులో శనివారం కలుసుకుని, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిని కూడా దుశ్శాలువాలతో గూడూరి శ్రీనివాస్ సత్కరించి, అభినందించారు.

11న జాబ్ మేళా

కంబాలచెరువు: ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారికి జాబ్ మేళాను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు శనివారం ఇంటర్మీడియట్ జోన్-1, 2 ఆర్‌జేడీ ఐ.శారద, డీవీఈవో జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐవో ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళా రిజిస్ట్రేషన్ కోసం హెచ్‌టీపీఎస్://బిట్.ఎల్వై/టెక్‌బీఈఈజీఓఏపీ వెబ్‌సైట్ ద్వారా జాబ్ మేళాకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2023–24లో పాస్ అయిన విద్యార్థులు, 2025లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులుకు కెరీర్ ఆటిట్యూడ్ టెస్ట్ నిర్వహించి వాటిలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాది శిక్షణ అనంతరం రూ.1,70,000 నుంచి రూ.2,20,000 వరకు వేతనం అందుతుందన్నారు.

హస్తినలో బీజేపీ విజయంపై సంబరాలు



బీజేపీ శ్రేణుల సంబరాలు

సీటీఆర్ఐ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో, అభివృద్ధిని ఆశిస్తూ, స్కాముల నుంచి విముక్తి కోరుతూ ఢిల్లీ ప్రజలు భారతీయ జనతా పార్టీకి ఓటేసి అద్భుతమైన విజయాన్ని అందించడం శుభపరిణామమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. శనివారం స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఢిల్లీలో బీజేపీ విజయం సాధించినందుకు శ్రేణులు సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకుని, బాణ సంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో నగర అసెంబ్లీ కన్వీనర్ రంగబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, బొమ్మల దత్తు, రేలంగి శ్రీదేవి, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

15న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 15న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 10.54 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, జయ, విజయ, గరుడ అళ్వార్, విష్ఫక్సేనుడు, వరాహ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శిఖర, యంత్ర రాజ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విగ్రహాలను మండలంలోని ఏడు గ్రామాల్లో ట్రాక్టర్లపై ఊరేగించారు.13న గణపతి పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ. కోటి వ్యయంతో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి.

థామస్ కుక్ నూతన శాఖ ప్రారంభం



థామస్ కుక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ప్రకాశం నగర్: ప్రముఖ ట్రావెల్ సంస్థ థామస్ కుక్ నూతన శాఖ శనివారం స్థానిక దానవాయిపేటలో ఎస్‌కేవీటీ స్కూలు ఎదురుగా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్నికి రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై సంస్థ శాఖను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాకచర్ల రాజా, మైత్రి, సంస్థ ఉపాధ్యక్షుడు సంతోష్ ఖానా, సీనియర్ జనరల్ మేనేజర్ అబ్దుల్ రహీమ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	బడాస్ రవికుమార్
సూర్యప్యాలెస్	పట్టుదల
స్వామి	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	తండేల్
అనుశ్రీ	ఒక పథకం ప్రకారం, మదగజరాజ
రాజా	తండేల్
ఊర్వశి	డాకు మహారాజ్
మేనక	గేమ్‌ఛేంజర్
రంభ	ఒక పథకం ప్రకారం, మార్కో
కుమారి	తండేల్
అప్సర	తండేల్
అశోక	పట్టుదల
నామవరం	
విఎస్.మహల్	తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	తండేల్
కడియం	
వెంకటసూర్య	తండేల్